క్లుప్తంగా

యోగా సర్వరోగ నివారిణి



యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

పులివెందుల టౌన్ : యోగా సర్వరోగ నివారిణి అని యోగా గురువు వెంకట్రామిరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు యోగా గురించి తెలియజేస్తూ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామాలయంలో ప్రత్యేక పూజలు

వేంపల్లె : స్థానిక బొడ్డు రాజన్న వీధిలో నూతనంగా నిర్మించిన సీతారామాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట చేసి 41 రోజులు పూరైన సందర్భంగా మంగళవారం అర్చకులు స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చన, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామ సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేర్లు లేని వారు అర్జీలు ఇవ్వండి

కొండాపురం : రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వబోతున్న అన్నదాత సుఖీభవ పథకంలో రైతుల పేర్లు లేని వారు అయా రైతు సేవాకేంద్రాల్లో ఆర్జీలు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి ఏవీ రామాంజులరెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన అన్నదాత సుఖీభవ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వబోతోందని ప్రస్తుతం మండలంలోని గ్రామ రైతు సేవా కేంద్రాల్లో అర్హుల జాబితాను విడుదల చేశామన్నారు. అర్హుల జాబితాలో రైతులు పేర్లు లేని రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు ఆయా రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ గ్రామ సిబ్బందికి అర్జీలు ఇవ్వాలన్నారు. 20వ తేదీ తర్వాత గ్రీవెన్స్ ఇస్తే వెంటనే పేర్లులేని రైతుల జాబితాను నివేదిక పంపుతామన్నారు. వారికి కూడా పథకం వర్తిస్తుందన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో దివ్యాంగులు, వృద్ధులు

లింగాల : స్థానికంగా ఉన్న దీనబంధు ఆశ్రమంలో మంగళవారం పులివెందుల లయోలా పాలిటెక్నిక్ కళాశాల రిటైర్డు ప్రొఫెసర్ ఆర్.విశ్వనాథరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి దివ్యాంగులు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దీనబంధు ఆశ్రమ నిర్వాహకుడు, వికలాంగుల సేవకుడు జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ ఆర్.విశ్వనాథరెడ్డి గొప్ప మానవతావాది, గొప్ప వ్యక్తిత్వాన్ని కలిగిన వారని, ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు 7191 మంది రైతులు అర్హులు

పెద్దముడియం : అన్నదాత సుఖీభవకు పెద్దముడియం మండలానికి చెందిన 7191 మంది రైతులు అర్హులు ఉన్నారని మండల వ్యవసాయాధికారి జకీర్‌షరీఫ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 7050 మందికి పైగా రైతులకు ఈకేవైసీ పూర్తి అయ్యిందని మిగతా వారు కూడా ఈనెల 20లోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. అర్హుల జాబితా రైతు సేవకేంద్రాలలో అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే న్యాక్ లక్ష్యం



మాట్లాడుతున్న అర్బన్ సీఐ చాంద్‌బాషా

పులివెందుల రూరల్ : నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే న్యాక్ లక్ష్యమని అర్బన్ సీఐ చాంద్ బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక న్యాక్ బిల్డింగ్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళలో 10 వివిధ సంస్థల కంపెనీ ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ మాట్లాడుతూ జాబ్ మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతినెలా జిల్లాలోని నియోజకవర్గాలలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు 276 మంది నిరుద్యోగులు హాజరు కాగా.. 89 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో న్యాక్ ఇన్‌చార్జి చెన్నకేశవ, వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

పడిపోయిన పచ్చి మిరప ధరలు

- మార్కెట్‌లో 50 కిలోల బస్తా ఐదారు వందలే
- కూలీల ఖర్చులు కూడా రాలేదని రైతుల ఆవేదన
- సాగులో ఆశాజనకంగా దిగుబడులు
- ధరల్లేకనే మిరప రైతులు విలవిల



వేల్పుల వద్ద సాగులో ఉన్న మిరప తోట

వేముల : ఈ ఏడాది పచ్చి మిరప ధరలు అమాంతంగా పడిపోయాయి. తోటలలో దిగుబడులు చేతికి వచ్చినప్పటి నుంచి మార్కెట్‌లో ధరలు పుంజుకోలేదు. గత ఏడాది మిరప ధరలు బాగా ఉండటంతో ఈ ఏడాది రైతులు వేసవి మిరప సాగును విస్తారంగా చేపట్టారు. బయట ప్రాంతాల్లోని నర్సరీలలో మొక్కలు తీసుకొచ్చి సాగు చేశారు. ఒక్కొక్క మొక్క 50 పైసల నుంచి ఒక్క రూపాయితో కొనుగోలు చేశారు. రైతులు మిరప సాగుకు మొగ్గు చూపడంతో నర్సరీల నిర్వాహకులు మొక్కల ధరలు పెంచి సొమ్ము చేసుకున్నారు. సాగులో పెట్టుబడులు అవుతున్న ఆదాయం ఉంటుందనే ఉద్దేశ్యంతో రైతులు సాగుకు మొగ్గు చూపారు.

మార్కెట్‌లో పడిపోయిన మిరప ధరలు

దిగుబడులు వచ్చే ఆరంభంలో మార్కెట్ ధరలు బాగా ఉంటాయి. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా ధరలు ఉండటంతో రైతులు నష్టపోతున్నారు. గత ఏడాది పచ్చిమిరప ధరలు ఆరంభంలో 50కిలోల బస్తా 3 వేలకుపైనే ధరలు పలికాయి. ఈ ఏడాది 50కిలోల బస్తా ఐదారు వందలకు మించి ధరలు లేవు. దీంతో మిరప సాగులో ఆశించిన మేర ఆదాయం ఉండదనే సాగులో పెట్టిన పెట్టుబడులు కూడా గిట్టుబాటు అవుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూలీ ఖర్చులకు కూడా రాలేదని ఆవేదన

మిరప సాగు రైతులను నష్టాల బాటలోకి నెట్టింది. ఈ ఏడాది ధరలు పుంజుకోకపోవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బతి తగులుతోంది. మార్కెట్ ధరలను చూస్తే కూలీ ఖర్చులు కూడా వస్తాయో లేదోననే భయంతో కోతలు కూడా కోయలేకపోతున్నామని రైతులు అంటున్నారు. కూలీ రేట్లు పెరగడంతో రైతుకు గిట్టుబాటు కావడంలేదు. వ్యవసాయ పనులు ఉండటంతో మిరప కోతలకు కూలీల డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో ధరలు లేక, కూలీ రేట్లు పెరగడంతో రైతులకు మిరప సాగు నష్టాలను తెచ్చి పెడుతోంది. రోజుకు ఒక్కొక్క కూలీకి మధ్యాహ్నం వరకు రూ.300లు ఇస్తున్నామని, బస్తా మిరప కాయలు కూడా కోయలేకపోవడంతో గిట్టుబాటు కావడంలేదని రైతులు అంటున్నారు.

మిరప సాగులో ఆశాజనకంగా దిగుబడులు

వేసవి మిరప సాగులో దిగుబడులు ఆశాజనకంగా



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న మిరప కాయల బస్తాలు

ఉన్నాయి. ఈ ఏడాది వేసవి మిరప పంటను రైతులు మార్చి నెలలో సాగు చేసుకున్నారు. సాగు చేసినప్పటి నుంచి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పంటకు తెగుళ్ల సోకకుండా సకాలంలో మందులు పిచికారి చేశారు. అలాగే సకాలంలో నీటి తడులు ఇవ్వడంతో పంట ఏపుగా పెరిగి ఆశించిన మేర దిగుబడులు అందుతున్నాయి. ఎకరాకు రూ.250ల నుంచి రూ.300ల బస్తాల వరకు మిరప దిగుబడుల వస్తున్నాయని రైతులు అంటున్నారు. సాగులో దిగుబడులు ఆశించిన మేర మార్కెట్ ధరలు ఉంటే ఎకరాకు రూ.2లక్షల వరకు ఆదాయం ఉండేదని రైతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

6ఎకరాలలో మిరప సాగు చేశా



నాకున్న 6 ఎకరాలలో వేసవి పంటగా పచ్చి మిరప సాగు చేశా. సాగుకు రూ.6 లక్షల మేర పెట్టుబడి పెట్టా. తోటలలో దిగుబడులు వస్తున్నాయి. మార్కెట్ ధరలు లేక కూలీలకే సరిపోతోంది. చివరి కోతల్లోనైనా మార్కెట్ ధరలు పెరుగుతాయనే ఆశతో ఉన్నాం. ధరలు పెరగక ఇలాగే ఉంటే సాగులో తీవ్రంగా నష్టపోతాం.

– శివశంకర్‌రెడ్డి, మిరప రైతు, మబ్బుచింతలపల్లె

ధరల్లేక సాగులో నష్టపోయా



ఈ ఏడాది ధరలు ఉంటాయనే ఆశతో 2 ఎకరాలలో మిరప పంటను సాగు చేశా. సాగుకు రూ.2 లక్షల మేర పెట్టుబడి పెట్టా పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకున్నా. దిగుబడి చేతికొచ్చేసరికి మార్కెట్‌లో మిరప కాయలు ధరలు పడిపోయాయి. దిగుబడులు వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ధరలు లేవు. సాగులో పెట్టుబడులు రాక, కూలీ ఖర్చులు కూడా గిట్టుబాటుకాక నష్టపోయా.

– గంగిరెడ్డి, మిరప రైతు, నారేపల్లె

పీఎం సూర్య ఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వల్లూరు (చెన్నూరు) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ హరి సేవ్యా నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం చెన్నూరు 33/11 కేవీ ఉప కేంద్రం ఆవరణలో చెన్నూరు, వల్లూరు మండలాలకు సంబంధించిన విద్యుత్ సిబ్బంది, వినియోగదారులతో పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగం యొక్క ఆవశ్యకతను వినియోగదారులకు వివరించారు. సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వెంకటేశ్వర్లు, రూరల్-2 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు లావణ్య, జూనియర్ ఇంజనీర్లు ప్రవంతి, గోవర్ధన్, రూరల్ 2 సబ్ డివిజన్ సిబ్బంది, వినియోగ దారులు, సోలార్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అమ్మకం

ప్రొద్దుటూరు : జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాం, షూస్, బ్యాగ్, ఇతర విద్యా సామగ్రి విచ్చలవిడిగా అమ్ముతున్నాయని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా స్కూళ్ల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా వాటిని ముద్రించి తమకు అనుకూలమైన రేట్లకు అమ్ముతున్నారని విమర్శించారు.

అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



జగనన్న అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే దృశ్య మాలిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నరేన్

– వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి

కమలాపురం : కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, ఈ ప్రభుత్వాన్ని ప్రజలు బంగాళ ఖాతంలో కలిపేయడం ఖాయం అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన జగనన్న అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే దృశ్య మాలిక పుస్తకాన్ని ఇతర నాయకులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా 1.80 కోట్ల మహిళలున్నారని వారిని కూటమి ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందన్నారు. 2014 ఎన్నికల్లో డ్వాక్రా, బంగారు రుణాలు మాఫీ చేస్తానన్న చంద్రబాబు 2024లో స్త్రీశక్తి, మహాశక్తి అని మహిళలకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఆ పథకాన్ని పీ4కు అనుసంధానం చేసానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ పథకం అమలు చేస్తే ఏటా రూ.32,400 కోట్లు అవసరం అవుతుందన్నారు. దీనిని అమలు చేయలేక పీ4ను తెరపైకి తీసుకు వస్తున్నారని, పీ4 ద్వారా 1.80కోట్ల మందిని దత్తత తీసుకునే సంపన్నులు రాష్ట్రంలో ఉన్నారా? అని ఆయన ప్రశ్నించారు. దాతల వివరాలు టీడీపీ నాయకులకే తెలియాలని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మహిళల కోసం జగనన్న అనేక పథకాలు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందన్నారు. దాదాపు 30 లక్షల మంది విద్యార్థులకు వివిధ కారణాలతో తల్లికి వందనం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలో తల్లికి వందనం నిధులు జమ చేయక పోవడంతో పాటు నాడు-నేడు, ఇంగ్లీష్ మీడియం, ట్యాబులు, సీబీఎస్ఈని రద్దు చేసిందన్నారు. జగనన్న ఇచ్చే మెనూ, బ్యాగులు మాత్రం ఇస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన జీరో అన్నారు. ఆరోగ్య శ్రీ సేవల పరిధిని జగనన్న రూ. 25 లక్షలకు పెంచితే దానిని పూర్తిగా ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం పావులు కదుపుతోందన్నారు. జగనన్న 17 మెడికల్ కళాశాలలకు శంఖుస్థాపనలు చేశారని గుర్తు చేశారు. పులివెందులకు కేటాయించిన మెడికల్ సీట్లను వద్దని చెప్పిన మహా సుభావుడు చంద్రబాబు అని, ఇంతటి దౌర్భాగ్య పరిస్థితి ఏ రాష్ట్రంలో ఉంటుంది అని ఆయన ప్రశ్నించారు. 55 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద ఒకే సారి రూ.20వేలు ఇస్తామని చెప్పిన బాబు ఇపుడేమో కేంద్రం ఇచ్చే నిధులతో కలిపి మూడు విడతల్లో ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆర్‌బీకేలను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ రచించిన రెడ్ బుక్ రాజ్యాంగం మాత్రం రాష్ట్రంలో నడుస్తోందన్నారు. అన్ని మండలాల కన్వీనర్లు ఉత్తమారెడ్డి, వీరారెడ్డి, జీఎస్ భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, రఘు నాథరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, చెన్నకేశవ రెడ్డి, మోహన్‌రెడ్డి, గండి భాస్కర్, హీరామియ్య, గఫార్, ఖాజా హుసేన్, మోనార్క్, కొండారెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, దేవదానం,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ గీతా



ప్రొద్దుటూరు క్రైం : జమ్మలమడుగు డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా డాక్టర్ గీతా నియమితులయ్యారు. కడప రిమ్స్‌లో డిప్యూటీ ఆర్ఎంఓగా పని చేస్తూ ఆమె ఇక్కడికి బదిలీ అయ్యారు. జమ్మలమడుగు డిప్యూటీ డీఎంహెచ్ఓగా పని చేస్తున్న డాక్టర్ శివప్రసాద్‌రెడ్డిని చాపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో డాక్టర్ గీతా ప్రొద్దుటూరు పీపీ యూనిట్, కల్లూరు, మోరగుడి పీహెచ్‌సీల్లో పని చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



డ్రైవర్లకు సూచనలిస్తున్న అర్బన్ సీఐ చాంద్ బాషా

పులివెందుల రూరల్ : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక కడప రోడ్డులో ఉన్న జీపుల స్టాండు ప్రాంతాలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించి మాట్లాడారు. డ్రైవర్లకు మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులతోపాటు జరిమానాలు విధిస్తామన్నారు.

దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన రికార్డులను వాహనాల్లో ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడంవల్ల ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారన్నారు. అలాగే డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. అధికారులు చెప్పే సలహాలు, సూచనలు తప్పనిసరిగా డ్రైవర్లు పాటించాలన్నారు.

గతంలో ఉన్న అగ్రిమెంట్‌ను కొనసాగించాలి



జెఎన్‌టీయూలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

పులివెందుల రూరల్ : గతంలో ఉన్న పాత అగ్రిమెంట్‌నే కొనసాగించాలని జెఎన్‌టీయూ కాంట్రాక్టు అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాల ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఎన్టీయూ కాంట్రాక్టు అధ్యాపకులు మాట్లాడుతూ కొత్త అగ్రిమెంట్ మీద సంతకం చేస్తే మా మెడ మీద కత్తి పెట్టినట్లవుతుందని, అందుకే కొత్త అగ్రిమెంట్ ఒప్పుకోవడం లేదన్నారు. కొత్త అగ్రిమెంట్‌ను ఒప్పుకోవడంవల్ల నెల రోజుల్లో మమ్మల్ని తొలగించే అవకాశం ఉందన్నారు. యూనివర్సిటీలో పనిచేసే కాంటాక్ట్ అధ్యాపకులకు అగ్రిమెంట్లు ఇచ్చేవారని, 15 ఏళ్ల నుంచి యూనివర్సిటీ పరిధిలో పనిచేస్తున్నామని, జీతాలు కూడా ఇస్తున్నారన్నారు. ఈ ఏడాది జూన్ 3వ తేదీన పాత అగ్రిమెంట్లపై సంతకాలు చేశామని, వారం రోజుల క్రితం యూనివర్సిటీ నుంచి కొత్త అగ్రిమెంట్లు వచ్చాయని, సంతకాలు పెట్టాలని కొత్త అగ్రిమెంట్లు వచ్చిందని ప్రిన్సిపాల్ తెలియజేశారన్నారు. కానీ పాత అగ్రిమెంట్‌కు, కొత్త అగ్రిమెంట్‌కు చాలా వ్యతిరేకంగా ఉన్నాయని, శాంక్షన్ పోస్టు కింద మేము పనిచేస్తున్నామని, ఇప్పుడు ఇచ్చిన అగ్రిమెంట్‌లో మాకు శాంక్షన్ అయినా పోస్టులకు సంబంధం లేదని ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు రిక్రూట్‌మెంట్ల కోసం నోటిఫికేషన్ ఇచ్చేవారని, యూనివర్సిటీలో పనిచేసే వారికి వెయిటేజ్, సర్వీస్ సర్టిఫికెట్లు ఇచ్చేవారన్నారు. మా సమస్యలు చెప్పుకునేందుకు రాజకీయ నాయకులు వద్దకు వెళ్లినా, కోర్టులను ఆశ్రయించినా విధుల నుంచి తొలగిస్తామని అగ్రిమెంట్‌లో పేర్కొనడం జరిగిందన్నారు. అందువల్ల పాత అగ్రిమెంట్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

తూతూ మంత్రంగా ఉపాధి ఓపెన్ ఫోరం



ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తున్న డీడబ్ల్యూఎం ఏపీడీ ఆదిశేషారెడ్డి

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా 20 గ్రామ పంచాయతీలలో 2024 మార్చి నుంచి 2025 మార్చి వరకు 1021 వివిధ రకాల ఉపాధి పనులకు గాను రూ.7,02,15,776ల నిధులు వెచ్చించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహించి ఉపాధి ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీడబ్ల్యూఎం ఏపీడీ ఆదిశేషారెడ్డి హాజరై ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ సామాజిక తనిఖీ నామమాత్రంగా నిర్వహించినట్లు ప్రజలు పెదవి విరుస్తున్నారు. కార్యక్రమంలో డీపీఓ జుబేదాబేగం, ఎస్టీఎం లోకేష్‌రెడ్డి, ఎస్‌క్యూ ఏపీడీ సోమశేఖరరెడ్డి, ఎస్ఆర్పీ నాగరాజు, ఏపీఓ జయ భారతి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి



మొక్కలు నాటుతున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

తొండూరు : మొక్కలను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ కరువు ఎడారి నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఒక మొక్కను నాటి నీరు పోసి సంరక్షించి కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నూరు మండలం అనుబంధ విభాగాల నియామకం

వల్లూరు (చెన్నూరు) : వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు చెన్నూరు మండల వైఎస్సార్‌సీపీ వివిధ అనుబంధ విభాగాల నియామకం జరిగింది. యువజన విభాగ అధ్యక్షుడిగా నిత్యపూజ, ఉపాధ్యక్షులుగా రామకోటిరెడ్డి, కార్తీక్, పవన్, చంద్ర, మధుసూదన్, సయ్యద్ ముష్టియా, కార్యదర్శులుగా శ్రీనాథ్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, ప్రసాద్, ఈశ్వర్, అనిల్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా చేపలయ్య, ఆర్.శివరాం, వెంకటశివ, ఎస్.నజీర్, ఖాజా, బ్రహ్మయ్య, పార్థసారథిలను నియమించారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

లింగాల : పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని లోపట్నూతల, లింగా గ్రామ పంచాయతీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రమేష్ పండించే పంటలలో ఎదుర్కొంటున్న చీడ, పీడల సమస్యల గురించి తెలుసుకుని వాటి నివారణకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం లోపట్నూతల గ్రామంలో మినుము పంటను పరిశీలించి పురుగుల ఉధృతిని గమనించి సస్యరక్షణ చర్యలను సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పులివెందుల..

పులివెందుల రూరల్ : ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథకాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ హాజరై మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోవాలన్నారు. హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ అరటిలో సిగటోకా, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తెలియజేశారు. ఏఓ చెన్నారెడ్డి సబ్సిడీతో జిప్సం కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ, రైతు సేవా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


కమలాపురంలో..

కమలాపురం : రైతులు తాము సాగు చేసుకునే పంట పొలాల్లో సాగుకు ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని చదిపిరాళ్ల, రామ చంద్రాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలు తదితర అంశాలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, తద్వారా తగిన వెతాదులో ఎరువులు వాడటంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే విత్తన శుద్ధి చేయడం వలన పైరుని తొలిదశలో వైరస్ తెగుళ్లు, రసం పీల్చే పురుగుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విత్తన శుద్ధి చేసేందుకు బీజామృతం తయారీని డెమో ద్వారా తెలియజేశారు. జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టల వాడకము, కషాయాల తయారీ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ గాయత్రి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి జకీర్ షరీఫ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మ పోషకాల యాంత్రీకరణపై అవగాహన కల్పించారు. అలాగే ఖరీఫ్ సీజన్‌లో సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.

చింతకొమ్మదిన్నెలో..



పులివెందుల : మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : రైతులు పంటల సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధానాలను అనుసరించాలని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు చంద్రనాయక్ పిలుపునిచ్చారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అప్పరాజుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తామన్నారు. భూసార పరీక్షలకు ఆధారంగా రైతులు సూక్ష్మ పోషకాలు వాడి దిగుబడి పెంపొందించుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వ్యవసాయ డ్రోన్లు 80 శాతం సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతు సోదరులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈశ్వరరెడ్డి, ఎంపీఏఓ శ్రీధర్‌రెడ్డి రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి సురేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : సాగులో ఉన్న పత్తి పంటలో పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని



కమలాపురం : రైతులకు పొలం పిలుస్తోందిపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

అనిమెల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు వాడటం వలన భూమిని సారవంతమైన నేలగా మార్చుకోవచ్చునన్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. పత్తి పంటలో మెగ్నీషియం, బోరాన్ లోపాలు ఉన్నట్లు గమనించామని బోరాన్ లోప నివారణకు పంట సాగు చేసిన 60 నుంచి 90 రోజుల తరువాత లీటరు నీటికి 1.1.5గ్రాములు బోరాక్స్ వారం వ్యవదిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి నాగభూషణంరెడ్డి, వ్యవసాయ సహాయకుడు రెడ్డెప్ప, రైతులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : మండల వ్యాప్తంగా వేసవి పంటగా సాగు చేసిన పత్తి పంటలో తెగుళ్లను నివారించాలని ఏఓ ఓబులేసు రైతులకు సూచించారు. మండలంలోని చాగలేరు, గుండ్లపల్లె గ్రామాల్లో పత్తి పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో రసంపీల్చే పురుగులు అధికంగా ఉన్నాయన్నారు. వీటి నివారణకు ఎల్లోట్రాప్స్ ఎకరాకు 10 చొప్పున అమర్చుకోవాలని సూచించారు. అలాగే కాండానికి పూత పద్ధతిలో మోనోక్రోటోపాస్ 2ఎం.ఎల్ 5 లీటర్ల నీటిలో కలిపి 20-30 రోజులలో పూసినచో వీటిని నివారించుకోవచ్చునన్నారు. మోనోక్రోటోపాస్ 1.5ఎం.ఎల్ లీటరు నీటిలోనూ, ఆసిఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో పిచికారి చేస్తే పూర్తిగా నివారించుకోవచ్చునన్నారు. వర్షాలు వస్తే పంటకు నల్ల, పచ్చ దోమలు ఆశిస్తాయని, రైతులు ముందుజాగ్రత్తగా మందులను పిచికారి చేసుకుంటే పంటను కాపాడుకోవచ్చునన్నారు. పత్తి పంటలో మెళకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, ఎంపీఈఓ లక్ష్మి, సర్పంచ్ అర్జున్, రైతులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : విత్తన శుద్ధి చేసి రైతులు పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గిడ్డింగివారిపల్లె, బక్కన్నగారిపల్లె, టి.వెలమవారిపల్లెల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మిరప, పత్తి పంటలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ అర్హులైన రైతులందరికి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, వ్యవసాయ పరికరాలు వస్తాయని, నూతన పద్ధతుల్లో పంటల సాగు చేయాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని పంటలు సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. అనంతరం రైతు సేవా కేంద్రాలలో గ్రామసభ ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. వ్యవసాయ పరికరాలు, మేలు రకం విత్తనాలను అందించాలని పలువురు రైతులు కోరారు. గిడ్డింగివారిపల్లెలో కిసాన్ గ్రూపు తయారు చేస్తే 80 శాతం సబ్సిడీతో డ్రోన్ పరికరం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.